సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 20 । మే । 2023

న్యూస్‌రీల్

నేడు గురుకుల ప్రవేశ పరీక్ష

- పకడ్బందీగా నిర్వహించాలి
- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

సాక్షి, పాడేరు: ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని గురుకుల విద్యాలయాల్లో ఐదవ తరగతి, రాష్ట్రంలోని పలు గురుకులాల్లో ఇంటర్, డిగ్రీ మొదటి సంవత్సరాల్లో ప్రవేశానికి శనివారం జరిగే ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. ప్రవేశ పరీక్షలకు సంబంధించి కలెక్టర్ శుక్రవారం సాయంత్రం, సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పరీక్షల నిర్వహణకు తగు సూచనలు జారీ చేశారు. ఉదయం, మధ్యాహ్నం వేర్వేరుగా జరిగే ప్రవేశ పరీక్షలకు గాను పాడేరులోని ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అన్ని చోట్ల విద్యార్థుల సౌకర్యార్థం సురక్షిత తాగు నీటి వసతి కల్పించాలని ఆదేశించారు. హెల్త్ సూపర్‌వైజర్లతో పాటు, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.అన్ని పరీక్ష కేంద్రాలలో మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్పీ తుహిన్ సిన్హా, జిల్లా రెవెన్యూ అధికారి పి.అంబేద్కర్, జిల్లా విద్యాశాఖాధికారి సలీం బాషా, జిల్లా పరీక్షల సమన్వయాధికారి వీవీ రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

చింతపల్లిలో వైరల్ జ్వరాలు



జ్వరం సోకిన సందీప్

చింతపల్లి: మండల కేంద్రం చింతపల్లిలో వైరల్ జ్వరాల ప్రభావం ఎక్కువగా ఉంది. పెద్ద పైపు, కుమ్మరి వీధిలో సుమారు 40 మంది జ్వరాలతో బాధపడుతున్నారు. వీరి లో ఎస్.జయవర్ధన్, పి.సందీప్, స్వరూప్‌రాజ్, విజయ్‌కుమార్, రీషిబాబు, భవాని తదితరులు ఉన్నారు. వైద్యాధికారులు స్పందించి జ్వరాల అదుపునకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మోదమ్మను దర్శించుకున్న ఉన్నతాధికారి



మోదకొండమ్మతల్లిని దర్శించుకున్న సీఆర్‌పీఎఫ్ డీఎస్పీ రాజ్‌కుమార్, కుటుంబ సభ్యులు

సాక్షి, పాడేరు: మన్యప్రజల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మతల్లిని విశాఖపట్నం సీఆర్‌పీఎఫ్ డీఎస్పీ రాజ్‌కుమార్‌తోపాటు కుటుంబ సభ్యులు శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.ఆలయ కమిటీ ప్రతినిధులు డీఎస్పీ రాజ్‌కుమార్, కుటుంబ సభ్యులకు అమ్మవారి ప్రసాదాలను పంపిణీ చేశారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

- ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండలంలోని సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టులో జెడ్పీ నిధులు రూ.10లక్షలతో డ్రైనేజీ నిర్మాణానికి శుక్రవారం ఆమె శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మన్యంలో గిరిజన గ్రామాలకు మహర్దశ వచ్చిందన్నారు. ప్రతీ గ్రామంలో డ్రైనేజీలు, రహదారి, సీసీ రోడ్డు సౌకర్యం కల్పించి రవాణా వ్యవస్థ మెరుగుకు ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమేష్,ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల నేతలు మూర్తి, జగబందు, దామోదరం, రాంప్రసాద్, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి

చింతపల్లి: స్థానిక రామాలయం వీధికి చెందిన 9వ తరగతి విద్యార్థిని ఉగ్రంగి ధనేశ్వరి శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది.గత మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఆమెను శుక్రవారం చింతపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఇక్కడి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.తండ్రి సత్యారావు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు.

గిరి యువతకు కల్పతరువు

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి యువకులు, ఔత్సాహికులకు నైపుణ్యాన్ని అందిస్తున్నారు. పందిరిమామిడి పరిశోధన స్థానంలోని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు. తాటిచెట్లపై ఉపాధి పొందేందుకు స్థానిక గిరిజనులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇక్కడ తాటి రకాలపై పరిశోధనలు చేస్తున్నారు. ప్రస్తుతం 30 రకాల ఉత్పత్తులను మార్కెట్లోకి అందుబాటులోకి తీసుకువచ్చారు. భవిష్యత్తులో తాటి ఉత్పత్తులపై శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు మరింత కల్పించడమే లక్ష్యమని వారు పేర్కొన్నారు.



దిగుబడి, ఎదుగుదలపై పరిశోధన చేస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

- 272 తాటి రకాలపై పరిశోధనలు
- 12 రకాల ఆహార పదార్థాలకు ఫుడ్ సేఫ్టీ లైసెన్సు
- మెరుగైన ఉపాధి అవకాశాలు లక్ష్యం
- మార్కెట్లోకి 30 రకాల ఉత్పత్తులు
- మరోపక్క అవగాహన కార్యక్రమాలు

రంపచోడవరం: గ్రామీణ ప్రాంతాల్లో తాటి చెట్లను కల్లు ఉత్పత్తి చేసే చెట్లుగానే పరిగణిస్తారు. ఇక్కడి శాస్త్రవేత్తలు అలా కాకుండా పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు గిరి యువతకు ఉపాధి మార్గాలు అందుబాటులోకి తెచ్చే లక్ష్యంతో తాటి చెట్లపై విస్తత పరిశోధనలు చేస్తున్నారు. దేశంలో వివిధ ప్రాంతాల నుంచి 272 రకాల తాటిమొక్కలను సేకరించారు. ఆంధ్రాలో నెల్లూరు, శ్రీకాకుళం, బిహార్, తమిళనాడు, ఒడిశా, కర్ణాటక, గుజరాత్ తదితర ప్రాంతాలనుంచి తీసుకువచ్చి ఇక్కడ పెంచుతున్నారు.

ఎదుగుదల, ఉత్పత్తులపై..

వాటి ఎదుగుదల, ఉత్పత్తులపై నిత్యం పరిశోధనలు చేస్తున్నారు. 1993లో ప్రారంభమైన ఈ పరిశోధనలు ఇప్పుడు ఆచరణకు నోచుకుంటున్నాయి. తాటి చెట్లను కేవలం కల్లు, వాసాలు, ఆకులను పైకప్పునకు వినియోగించడం వంటివి కాదు మరిన్ని ఉపయోగాలు ఉన్నాయని కేవీకే శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. తక్కువ ఎత్తు, తక్కువ కాలంలో కాపునకు వచ్చే రకాలపై పరిశోధనలు జరుగుతున్నాయి.



దేశంలో వివిధ రాష్ట్రాల నుంచి సేకరించి పెంచుతున్న తాటి రకాలు

తాటి పరిశోధన పథకంలో...

ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసీఏఆర్) ఆధ్వర్యంలో 1993 నుంచి అఖిల భారత సమన్వయ తాటి పరిశోధన పథకంలో వీటిని నిర్వహిస్తున్నారు.ఇప్పటి వరకు ఈ పరిశోధనల్లో 20 మంది వరకు శాస్త్రవేత్తలు భాగస్వాములయ్యారు. ప్రస్తుతం ఉద్యాన పరిశోధన శాస్త్రవేత్త డా. రాజేంద్రప్రసాద్, ఫుడ్ అండ్ సైన్సు టెక్నాలజీ శాస్త్రవేత్త డా. వీసీ వెంగయ్యపనిచేస్తున్నారు.

దేశంలో రెండు చోట్ల..

- తాటి చెట్లపై దేశంలో తమిళనాడులోని కలికులం, జిల్లాలో పందిరిమామిడిలోనే పరిశోధనలు జరుగుతున్నాయి.
- పందిరిమామిడి పరిశోధన స్థానంలో 272 రకాలు ఉన్నాయి. వీటిలో ఒకొక్క దానికి పది చొప్పున 2,720 తాటి చెట్లు ఉన్నాయి.

ప్రత్యేకతలివీ..

- శ్రీకాకుళం, నెల్లూరు ప్రాంతాల నుంచి తెచ్చిన మొక్కలు కాండం లావుగా, తక్కువ ఎత్తులో కాపునకు వచ్చాయి. దశల వారీగా నాటి మొక్కల్లో కొన్ని ఇంకా పూత దశకు రాలేదు. తరువాత కాలంలో 2016లో తెలంగాణలోని నల్గొండ జిల్లా కొండ మల్లేపల్లి, బీహార్‌లో సాబార్‌లో ఐసీఏఆర్ అనుమతులు ఇవ్వడంతో అక్కడ కూడా పరిశోధనలు ప్రారంభమయ్యాయి.

14 రకాలకు ఫుడ్ సేఫ్టీ లైసెన్సు

పందిరిమామిడి తాటి పరిశోధన స్థానం ద్వారా 14 రకాల తాటి ఆహార పదార్థాలకు ఫుడ్ సెఫ్టీ లైసెన్స్ పొందాయి. నీరా (కల్లు) పులియకుండా తియ్యని డ్రింక్ నిల్వ ఉండేలా తయారీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. అంతేకాకుండా నీరా ఆధారంగా తాటి బెల్లం, తాటి చక్కెర, తాటి చాకిలైట్లు, తాటి పానకాన్ని అందుబాటులో తెచ్చేందుకు ఇక్కడి శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు.

మన రాష్ట్రంలోనే మంచి రకాలు



తాటి చెట్లపై పరిశోధనలు జరుగుతున్నాయి. తాటి ఉత్పత్తుల ఆధారంగా తయారు చేసే ఆహార పదార్థాల్లో కొన్నింటికి ఫుడ్ సేఫ్టీకి అనుమతి వచ్చింది. మరికొన్ని ఆహార పదార్థాల తయారీపై పరిశోధనలు జరుగుతున్నాయి. తక్కువ ఎత్తులో పెరిగి కాపునకు వచ్చే రకాలపై పరిశోధన చేస్తున్నాం. భవిష్యత్తులో రైతులకు ఆయా రకాలను పరిచయం చేస్తాం. మిగతా రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రంలోనే మంచి రకాలు ఉన్నాయి.

– డా. రాజేంద్రప్రసాద్, వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త, పందిరిమామిడి

ఏటీఎంలో చోరీకి విఫలయత్నం

- అలారం మోగడంతో పరారైన దుండగులు



ఏటీఎంను పరిశీలిస్తున్న ఎస్‌ఐ సతీష్, నేరపరిశోధన బృందం



తొలగించిన ఏటీఎం డోర్

హుకుంపేట: స్థానిక కామయ్యపేట జంక్షన్ వద్ద ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి గురువారం అర్ధరాత్రి విఫల యత్నం జరిగింది. అలారం మోగడంతో దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. ఎస్‌ఐ సతీష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఏటీఎం ప్రవేశానికి ముందు గల సీసీ కెమెరాలకు కాగితాలను అడ్డం పెట్టి లోపలికి ప్రవేశించారు. వారు దుప్పటి ముసుగులో ఉండటం వల్ల ఎవరనేది పూర్తిగా తెలియరాలేదు. దొంగలు ఏటీఎం డోర్‌ను తెరిచారు. రెండవ తలుపును తెరిచేందుకు ప్రయత్నించారు. ఇంతలో ఏటీఎం అలారం మోగడంతో వారు అక్కడినుంచి పరారైనట్టుగా భావిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. ఏటీఎం హెడ్‌క్వార్టర్ ముంబై నుంచి చోరీకి యత్నించిన సమాచారం ఫోన్ ద్వారా పోలీసుస్టేషన్‌కు సమాచారం అందిన వెంటనే సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారన్నారు. విశాఖ నుంచి నేర పరిశోధక బృందంను రప్పించామని చెప్పారు. వారు శుక్రవారం ఏటీఎంను క్షుణ్ణంగా పరిశీలించి వేలిముద్రలు సేకరించారని ఆయన వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

చంద్రబాబూ.. తప్పుడు వ్యాఖ్యలు మానుకో

- సంక్షేమం, అభివృద్ధిని ఓర్వలేక విమర్శలు
- పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ధ్వజం
- అడ్డతీగలలో బాబు దిష్టిబొమ్మ దహనం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



అడ్డతీగలలో చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, శ్రేణులు

కొయ్యూరు: సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓర్వలేకనే పేదలకు ఇస్తున్న ఇళ్ల స్థలాలపై ఎస్.కోటలో చంద్రబాబు తప్పుడు వ్యాఖ్యలు చేశారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి విమర్శించారు. శుక్రవారం ఆమె రాజేంద్రపాలెంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం పట్టణాల్లో ఇస్తున్న సెంటు భూమి శవాన్ని పూడ్చి వేసి సమాధి కట్టడానికి మాత్రమే పనికివస్తుందని చంద్రబాబు వ్యాఖ్యానించడం సరికాదన్నారు. పేదలు బాగుంటే చూడలేని స్థితికి చంద్రబాబు దిగజారారని అన్నారు. అమరావతిలో పేదలకు కేటాయింపుపై కోర్టుకు వెళ్లారని, సుప్రీంకోర్టులో తీర్పు వ్యతిరేకంగా వచ్చాక ఇప్పుడు సెంటు భూమి అంటూ కొత్త రాగం పాడుతున్నారని ఆరోపించారు. పాడేరు డివిజన్‌లో మొదటి దఫాలో 17,149 మందికి ఇళ్ల మంజూరుచేయడమే కాకుండా ప్రభుత్వం బిల్లులు జమచేస్తోందన్నారు. 42 లేఅవుట్లలో 1,051 మంది నివాసం ఉండేలా అన్ని సౌకర్యాలు కల్పించారన్నారు. అధికారంలోకి వస్తే ఏమి చేస్తారో తండ్రీ కొడుకులు చెప్పలేకపోతున్నారని ధ్వజమెత్తారు. మన్యం మీదుగా ఇప్పుడు 516/ఈ రహదారి వెళ్తుంటే అది బాక్సైట్ కోసమని తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు. 2014 ఆగస్టు 9 ఆదివాసీ దినోత్సవం నాడు బాక్సైట్ తవ్వేందుకు జీవో 97ను చంద్రబాబు తీసుకువచ్చారని గుర్తు చేశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే దానిని రద్దు చేశామన్నారు. మన్యంలో ఇప్పుడు కాఫీ సాగును విస్తరించేందుకు వీలుగా ప్రభుత్వానికి నివేదించామన్నారు. పాడేరులో రూ.500 కోట్లతో వైద్య కళాశాల ఏర్పాటు చేస్తున్నారన్నారు. నాడు– నేడులో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆస్పత్రులను అన్ని వసతులతో తీర్చిదిద్దారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

అడ్డతీగల: పేదల అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. పేదలకు ఇస్తున్న ఇళ్ల స్థలాలను శ్మశానాలతో పోల్చిన చంద్రబాబు వ్యాఖలకు నిరసనగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ప్రధాన రహదారిపై వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలసి శుక్రవారం ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాలు అభివృద్ధి భాట పట్టాలనే సత్సంకల్పంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తూ ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని చెప్పుకుంటున్న చంద్రబాబు ఏనాడూ పేద ప్రజలకు ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. అందుకే గత ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారన్నారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోకపోతే రానున్న రోజుల్లో మళ్లీ అదేవిధంగా బుద్ధి చెబుతారన్నారు. రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల సత్యనారాయణ, ఎంపీపీ బొడ్డపాటి రాఘువ, వైస్ ఎంపీపీ కరణం వీరవెంకటసత్యనారాయణ పాల్గొన్నారు.

సేవలతో ప్రజలకు మరింత చేరువ



అవార్డులు పొందిన గ్రామ వలంటీర్లతో కలెక్టర్ సుమిత్‌కుమార్, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- జిల్లాలో 3,223 మంది వలంటీర్లకు పురస్కారాల అందజేత

పాడేరు రూరల్ : గ్రామ వలంటీర్లు ప్రజలకు మరింత చేరువ కావడమే కాకుండా అర్హులైన లబ్ధిదారులందరికీ మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. శుక్రవారం విజయవాడ ఎ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన వలంటీర్ల వందనం కార్యక్రమాన్ని పాడేరు కాఫీ గెస్ట్ హౌస్ సమావేశ మందిరం నుంచి వీక్షించారు. అనంతరం ఇక్కడ వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని 352 గ్రామ సచివాలయాల్లో 5,547 మంది గ్రామ వలంటీర్లు విధులు నిర్వహిస్తున్నారన్నారు. వీరిలో ఉత్తమ సేవలు అందించిన 3,323 మందిని గుర్తించి సేవా మిత్ర, సేవ రత్న, సేవా వజ్ర పురస్కారాలు రాష్ట్ర ప్రభుత్వం అందజేయడం గొప్ప విషయమన్నారు. అవార్డులు పొందిన వారిని ఆదర్శంగా తీసుకుని మిగిలిన వలంటీర్లు కూడా పని చేయాలని కోరారు. జిల్లాలో 3,100 మందికి సేవామిత్ర, 108 మందికి సేవా రత్న, 15 మందికి సేవా వజ్ర పురస్కారాలు అందించడం జరిగిందన్నారు. సేవా వజ్రాలుగా ఎంపికైన వారికి రూ.30 వేలు, సేవా రత్నకు రూ.20వేలు, సేవా మిత్రగా ఎంపికై న వారికి రూ.10వేల నగదును అందజేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, పాడేరు ఎంపీపీ సోనారి రత్నకుమారి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ సరస్వతి, మాజీ ఎంపీపీలు ఎస్వీ రమణమూర్తి, సీదరి మంగ్లన్నదొర, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, డీపీవో కొండలరావు, డీఆర్‌డీఏ పీడీ మురళి, డీఎల్పీవో కుమార్, గ్రామ వార్డు సచివాలయ అధికారి సునీల్, గ్రామ వలంటీర్లు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పంచగవ్యాధివాసం



విద్యుత్ కాంతులతో వేంకటేశ్వరస్వామి ఆలయం



ఆలయ ప్రధాన ద్వారం

రంపచోడవరం: రంపచోడవరం సమీపంలోని ఐ.పోలవరం జంక్షన్ వద్ద కొండపై టీటీడీ నూతనంగా నిర్మించిన శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ, మహాసంప్రోక్షణ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం శాస్త్రోక్తంగా పంచగవ్యాధివాసం నిర్వహించారు. పంచగవ్యాలైన పాలు, పెరుగు, నెయ్యి, గోమయం, గోమూత్రంతో అభిషేకం చేశారు. అనంతరం పంచగవ్య ప్రాసన, వాస్తు హోమం, అకల్మష ప్రాయశ్చిత్త హోమం, రక్షాబంధనం నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి యాగశాల వైదిక కార్యక్రమాలు జరిగాయి. తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ వేణుగోపాల దీక్షితులు, డిప్యూటీ ఈవోలు గుణభూషణరెడ్డి, వెంకటయ్య, శివప్రసాద్, డిప్యూటీ ఈఈ ఆనంద రామ్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం



గుళి రాగుల సాగును పరిశీలిస్తున్న ఒడిశా రాష్ట్ర అధికారుల బృందం

డుంబ్రిగుడ: ప్రకృతి వ్యవసాయ సాగు విధానాలను పరిశీలించేందుకు శుక్రవారం ఒడిశా రాష్ట్ర అధికారుల బృందం సాగర పంచాయతీ కిల్లోగుడ గ్రామంలో సంజీవిని సంస్థ డైరెక్టర్ దేముళ్లు ఆధ్వర్యంలో సందర్శించింది. కిల్లోగుడ వాసన్ సంస్థ ఏర్పాటు చేసిన ద్రవజీవామృతం యూనిట్‌కు దేశవాళీ గోవుల షెడ్డునుంచి నేరుగా పైపుల ద్వారా మూత్ర సేకరణను పరిశీలించారు. అలాగే గ్రామాల్లో రైతులు సాగు చేసిన గుళి రాగుల విధానంలో పంటలను పరిశీలించారు. జిల్లాలో మూడు రోజులు పర్యటించి అధ్యయనం చేస్తామని వారు తెలిపారు. ఈ పర్యటనలో ఒడిశా బృందానికి రైతు సాధికార సంస్థ టెక్నికల్ లీడ్ ప్రకాష్, జిల్లా మేనేజర్ భాస్కర్‌రావు, రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ దేముళ్లు పూర్తిస్థాయిలో వివరించారు.

దొంగతనం కేసుల్లో నిందితుల అరెస్టు

- నిఘా ఏర్పాటుచేసి పట్టుకున్న పోలీసులు
- 189 గ్రాముల బంగారం, మూడు బైక్‌లు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఓఎస్డీ మహేశ్వరరెడ్డి

ఎటపాక: పలు ప్రాంతాల్లో బంగారు ఆభరణాల దొంగతనాలకు పాల్పడిన వ్యక్తిని, అతడికి సహకరించిన మరో యువకుడిని స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం రంపచోడవరం ఓఎస్డీ, చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా వెల్లడించారు. విలీన మండలాల్లో వరుస దొంగతనాలపై చింతూరు ఏఎస్పీ ఆదేశాల మేరకు ఎటపాక సీఐ గజేంద్రకుమార్ నేతృత్వంలో ఎస్‌ఐలు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. తెలంగాణలోని అశ్వారావుపేట మండలం ఉసిర్లగూడెం గ్రామానికి నాగేంద్రబాబుకు ఈ దొంగతనాలతో సంబంధం ఉందని గుర్తించి, అతనిపై నిఘా ఏర్పాటుచేశారు. ఇప్పటివరకు పరారీలో ఉన్న అతనిని శుక్రవారం ఉదయం నెల్లిపాక శివారులో నాగేంద్రబాబును అదుపులోకి తీసుకుని విచారించారు. అతడు దొంగిలించిన నగలను అమ్మేందుకు సహకరించిన జీలుగుమిల్లి మండలం ములగలంపల్లి గ్రామానికి చెందిన వల్లూరి నాగరాజును అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 189 గ్రాముల బంగారు నగలు, దమ్మపేట,అశ్వారావుపేట స్టేషన్ల పరిధిలోని మూడు ద్విచక్ర వాహనాలు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

కదిలిన ఏరువాక

- ఖరీఫ్ పనులు ప్రారంభం
- గిరి రైతులు నిమగ్నం
- 90 శాతం రాయితీపై విత్తనాలు
- పంపిణీకి వ్యవసాయశాఖ ఏర్పాట్లు
- అనుకూలంగా వాతావరణం



కలవపూలు గ్రామ సమీపంలో మెట్ట వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన గిరి రైతులు

సాక్షి,పాడేరు : ఖరీఫ్ వ్యవసాయ పనులకు గిరిజన రైతులు శ్రీకారం చుట్టారు. జిల్లా వ్యాప్తంగా ఈఏడాది ఏప్రిల్ నుంచి విస్తారంగా వర్షాలు కురవడంతో దుక్కి పనులకు మేలు చేసింది. ఇప్పటికే జిల్లాలో 90శాతం వ్యవసాయ భూముల్లో మొదటి దుక్కి పనులు పూర్తయ్యాయి. మెట్ట భూముల్లో రైతులు విత్తనాలు జల్లుతున్నారు.

2,62,667 ఎకరాల్లో సాగు..

జిల్లాలో ఖరీఫ్‌లో 2,62,667 ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా దీనిలో 1,49,517 ఎకరాల్లో వరి, మిగిలిన 1,13,150 ఎకరాల్లో పలు రకాల వాణిజ్య, చిరుధాన్యాల పంటలను సాగు చేస్తున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో మెట్ట భూముల్లో వాణిజ్య, చిరుధాన్యాల సాగు పనులు 75శాతం పూర్తయ్యాయి. సాగు భూముల్లో భూసారం పెంచే లక్ష్యంగా ఇటీవల పచ్చిరొట్ట, జనుము, పిల్లి పెసర విత్తనాలకు 90శాతం రాయితీపై వ్యవసాయ శాఖ అందజేసింది.

వరి విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు

జిల్లాలోని 22 మండలాల్లోని గిరి రైతులకు ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా 90శాతం రాయితీపై వరివిత్తనాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాకు 18,207 క్వింటాళ్ల వరి విత్తనాలు ఖరీఫ్‌కు అవసరం. ఈ మేరకు వ్యవసాయశాఖ నివేదించింది.

సకాలంలో విత్తనాల పంపిణీ



ఖరీఫ్‌లో గిరి రైతులకు మేలు చేసే కార్యక్రమాలను అమలు చేస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆర్‌బీకే కేంద్రాల ద్వారా 90 శాతం రాయితీపై వరి విత్తనాలను గిరిజన రైతులకు ఈఏడాది కూడా పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నాం. – ఎస్‌బీఎస్ నందు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

జిల్లాలోని ఖరీఫ్‌లో పంటల వివరాలు

పంట	విస్తీర్ణం (హెక్టార్లు)	పంట	విస్తీర్ణం (హెక్టార్లు)
వరి	59,807	పెసలు	264
రాగులు	17,600	మినుములు	1128
చిరుధాన్యాలు	5,596	వేరుశనగ	1253
జొన్న	322	పత్తి	5499
గంటి	123	మిరప	318
మొక్కజొన్న	5400	చెరకు	180
కందులు	1339	పొగాకు	274
		పసుపు	5259

క్లుప్తంగా

గిరి సంప్రదాయానికి అద్దం పడుతున్న ఉత్సవాలు



ఉత్సవ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ, తదితరులు

పెదబయలు: ఏజెన్సీ ప్రాంతంలో జరిగే ఉత్సవాలు, పండగలు గిరిజన సంప్రదాయాలకు అద్దం పడతాయని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. శుక్రవారం మండలంలోని గోమంగి ఈశ్వరమ్మ జాతర ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 20, 21 తేదీల్లో జరిగే ఉత్సవాల్లో తనను భాగస్వాములను చేయడం ఆనందంగా ఉందన్నారు. పూర్వీకులు ఆచార సంప్రదాయాలను కొనసాగిస్తూ గ్రామ దేవతల ఉత్సవాలు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. మాజీ జెడ్పీటీసీ కొంటా సూర్యనారాయణ, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు గంపరాయి చిరంజీవి,జె.సత్యనారాయణ, కూడ చిట్టిబాబు,కొ మ్మ కొండబాబు, సీహెచ్ రమేష్‌కుమార్, కొమ్మ కొండబాబు, మల్లి కార్జునరావు, నీలయ్య, కె.మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

డీసెట్-2023 దరఖాస్తుల ఆహ్వానం

భీమునిపట్నం: డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కోర్సులో ప్రవేశం కొరకు నిర్వహించే డీసెట్-2023కు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ యు. మాణిక్యం నాయుడు తెలిపారు. ఈ నెల 28 వరకు దరఖాస్తుకు గడువు ఉందన్నారు. ఎంట్రన్స్ పరీక్ష ద్వారానే ప్రభుత్వ, గుర్తింపు పొందిన కాలేజీల్లో ఉపాధ్యాయ విద్య శిక్షణ అభ్యసించే అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు csc.ap.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత గల విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీనికి సంబంధించి వివరాలు కావాల్సిన వారు భీమునిపట్నంలో ఉన్న డైట్ కాలేజీలో సంప్రదించవచ్చన్నారు.

స్పందన ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం



గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పక్కన జేసీ, ఐటీడీఏ పీవో, అసిస్టెంట్ కలెక్టర్, డీఆర్వోలు

సాక్షి, పాడేరు: స్పందనలో స్వీకరించిన అన్ని ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, ఐటిడిఏ పివో వి.అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవతో కలిసి కలెక్టర్ శుక్రవారం పాడేరు ఐటీడీఏలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి వ్యక్తిగత, గ్రామాల సమస్యలపై 65 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ స్పందన ఫిర్యాదుల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం జగనన్నకు చెబుదాం, కార్యక్రమంలో ప్రత్యేక దృష్టి పెడుతోందని చెప్పారు. ఈమేరకు స్పందన ఫిర్యాదులు పరిష్కారానికి తక్షణమే చొరవ చూపాలని,కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. స్పందన పిర్యాదులపై జిల్లా, డివిజన్ స్థాయిలోని అధికారులంతా క్షేత్రస్థాయిలో గ్రామాల పర్యటించాలని, ఆయా సమస్యలు పరిష్కారానికి సంభందించిన నివేదికలను కూడా ఆన్‌లైన్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

మోదమ్మ ఉత్సవాల విజయవంతంపై కలెక్టర్ అభినందనలు

అల్లూరి జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పాడేరులో మోదకొండమ్మ జాతరను విజయవంతం చేశారని, కలెక్టర్ సుమిత్ కుమార్ అభినందనలను తెలిపారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ చేసిన సేవలు అభినందనీయమన్నారు. పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో పి.అంబేద్కర్, గిరిజన సంక్షేమశాఖ ఉపసంచాలకులు ఐ.కొండలరావు, గిరిజన సంక్షేమశాఖ పాడేరు, అరకులోయ ఈఈలు డి.వి.ఆర్.ఎం.రాజు, కె.వేణుగోపాల్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.జమాల్‌బాషా, జిల్లా ఉద్యానవన అధికారి రమేష్‌కుమార్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్.నంద్, డీఆర్‌డీఏ పీడీ వి. మురళి, పిహెచ్‌వో ఎస్.అశోక్, జీసీసీ డీఎం పార్వతమ్మ,ఐటిడిఏ పరిపాలనాధికారి హేమలత తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో స్వీకరించిన ఫిర్యాదులు

- చింతపల్లి మండలంలోని, లోతు గెడ్డ సచివాలయం పరిధిలోని బందబయలు గ్రామానికి చెందిన పాత చెరువు డైవర్షన్ వాల్ హుద్ హుద్ తుపానులో కొట్టుకొని పోయిందని, మరమ్మతులు చేసి, ఆయా భూములకు సాగు నీరందించాలని గ్రామస్తులు, భవాని, మురళి కృష్ణ, సన్యాసిదొర తదితరులు వినతిలో కోరారు.
- జి.మాడుగుల మండలం, వంతాల గ్రామ పంచాయతీ సిరిపురం గ్రామానికి చెందిన, గెమ్మెలి.సుబ్బారావు పాడేరు మండలం గొండెలి పంచాయతీ లంపెలి గ్రామస్తులు కొర్రా పద్మ తదితర 15 మంది రైతులు తమ సాగులో ఉన్న భూములకు అటవీ హక్కు పత్రాలు మంజూరు చేయాలని వినతులు అందజేశారు.
- కొయ్యూరు మండలంలోని మఠం భీమవరం పంచాయతీ బుగ్గిరాయి గ్రామంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ పోస్టుకు తనకు అవకాశం కల్పించాలని కె.శివకుమారి దరఖాస్తు చేశారు.
- జి.మాడుగుల మండలంలోని మద్దివీధి గ్రామానికి వెళ్లే రహదారిలో సీసీ ర్యాంపు నిర్మించాలని గ్రామస్తులు జి.రఘునాథరావు, కె.సురేష్ తదితరులు వినతిపత్రం సమర్పించారు.
- చింతూరు మండలం, గూడూరు గ్రామ అంగన్వాడీ కేంద్రంలోని సహాయకురాలు పోస్టుకు ఇటీవల ఇంటర్వ్యూలు నిర్వహించారని నియామక ఉత్తర్వులు జారీ చేయలేదని ఎస్.వినిత వినతిపత్రం సమర్పించారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



దారెలలో ఆర్‌బీకేను ప్రారంచి, స్టాక్ పరిశీలిస్తున్న అరకు ఎమ్మెల్యే పాల్గుణ, విశాఖ ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు: రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు.రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని దారెల పంచాయతీ కేంద్రంలో రూ.21.80లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే పాల్గుణ, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ రైతులకు గ్రామాల వద్దకే అన్ని సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఉద్దేశ్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేశారన్నారు. కేంద్రాల్లో రైతులకు విత్తనాలు, వ్యవసాయ పరికరాలను సబ్సీడితో ప్రభుత్వం అందిస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం విశాఖ ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం నిరంతరం ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఆర్‌బీకేలతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, గిరిజన రైతులకు 90శాతం సబ్సీడితో విత్తనాలను అందిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని రకాల పంటలు పండించాలని సూచించారు. ఎంపీపీ అరిసెల సీతమ్మ, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, నేతలు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పనే ప్రభుత్వ ధ్యేయం



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు, కంపెనీ ప్రతినిధులు

అరకులోయ రూరల్: నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ఉపాధి కల్పన జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ప్రశాంత్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటిఐలో శుక్రవారం మెగా జాబ్ మేళా జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రముఖ పది కంపెనీలతో నిర్వహించి జాబ్‌మేళాకు వివిధ మండలాల నుంచి 224 మంది హాజరయ్యారని, ఇందులో 76 మంది ఎంపిక చేశామన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జాబ్‌మేళాలో ఎంపిక కాని వారు నిరుత్సాహం పడొద్దని, నిత్యం జాబ్ మేళా ప్రక్రియల్లో భాగంగానే వివిధ రంగాల్లో నిరుద్యోగుల ఎంపిక చేస్తామన్నారు. వచ్చే నెలలో నిర్వహించే మేళాకు దశల వారీగా నిరుద్యోగులకు ఎంపిక చేసి ఉద్యోగా ఉపాధి కల్పిస్తామన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు శెట్టి రోషిణి మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న ఇటువంటి అవకాశం అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపిటీసీ సభ్యుడు ఆనంద్‌కుమార్, ఐటిఐ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ: నలుగురికి గాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సుబ్బారావు, బాలరాజు

హుకుంపేట: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో తీవ్ర గాయలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. హుకుంపేట మండలం కొట్నాపల్లి వద్ద నూతనంగా నిర్మిస్తున్న వంతెన వద్ద పాతకోట పంచాయతీ బొడ్డపుట్టు గ్రామానికి చెందిన పాంగి బుద్ర, పాంగి బలరాంలు హుకుంపేట నుంచి సొంత గ్రామానికి వెళ్తుండగా, సంతారి పంచాయతీ పత్రిమెట్ట గ్రామానికి చెందిన పాంగి బాలరాజు, సుబ్బారావులు తమ గ్రామం నుంచి హుకుంపేటకు తరుణంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో తీవ్ర గాయల పాలయ్యారు. ఈ ప్రమాదంలో పాంగి బాలరాజుకు కాలు విరిగిపోగా, పాంగి సుబ్బారావు తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. మిగిలిన వారు స్వల్ప గాయలతో బయటపడ్డారు. ఈ నేపథ్యంలో అదే రహదారిపై వెళ్తున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగ జిల్లా కార్యదర్శి నైని సత్తిబాబు తక్షణమే స్పందించి 108కు సమాచారం అందించారు. అయితే 108 తగిన సమయానికి రాకపోవడంతో తన సొంత ఖర్చులతో ప్రైవేట్ వాహనంలో క్షతగాత్రులకు పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆయన చేసిన సాయానికి పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఉమ్మడి ప్రణాళికతో డ్రగ్స్ రవాణాకు అడ్డుకట్ట



మాట్లాడుతున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి (విశాఖ దక్షిణ): ఉమ్మడి కార్యాచరణతో రైల్వే మార్గాల్లో మాదక ద్రవ్యాల రవాణాకు పూర్తి అడ్డకట్ట వేయనున్నట్టు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ తెలిపారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీఎఫ్, ఎస్ఈబీ, సిటీ టాస్క్‌ఫోర్స్, క్రైమ్, రైల్వేస్టేషన్ పరిధిలో గల లా అండ్ ఆర్డర్ అధికారులతో శుక్రవారం పోలీస్ సమావేశ మందిరంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఇందులో ప్రధానంగా నగరం మీదుగా రైల్వే మార్గాల ద్వారా జరుగుతున్న గంజాయి అక్రమ రవాణాను పూర్తిగా నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఏయే మార్గాల్లో రవాణా జరుగుతుంది, దాని తీరు, గత ఏడాది నుంచి నమోదైన కేసులపై విశ్లేషించి అన్ని శాఖలు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు.

పర్యావరణహిత జీవనశైలితో మేలు



సుర్మతి గ్రామంలో జీవనశైలి-పర్యావరణంపై గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న ఫారెస్టు అధికారి శ్రీనివాస్



దారెలలో మొక్కలు నాటాలని ప్రతిజ్ఞ చేస్తున్న అరకు ఎమ్మెల్యే పాల్గుణ, విశాఖ ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర, ఫారెస్టు అధికారులు

దేవీపట్నం: పర్యావరణ పరిరక్షణకు ప్రజలందరూ బాధ్యతగా కట్టుబడి ఉండాలని ఎంపీపీ కుంజం మురళీ తెలిపారు. అటవీశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ శాఖ సిబ్బంది శుక్రవారం పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతన గ్రామస్తులకు వివరించారు. ఈ మేరకు ఇందుకూరుపేట బస్టాండు సెంటర్‌లో, గ్రామ సచివాలయం వద్ద, కంబలం పాలెం , ఉప్పయ్యపాలెం సెంటర్లలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న పోతురెడ్డివారి చెరువు వద్ద స్థానికులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిగ్ వాడకం పూర్తిగా మానివేయాలని, విరివిగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించడం, అడవి జంతువుల వేట నిరోధించాలని, పర్యావరణహిత జీవనశైలిపై అవగాహన కల్పించారు. ఫారెస్ట్ సెక్షన్ అధికారి శ్యామ్ కుమార్, ఎఫ్‌బీఓలు రుద్రరూపాక్ష, శ్రీదేవి, అనంత లక్ష్మి, రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కందుల బాబ్జి, మురళీకృష్ణ పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలోని దారెల పంచాయితీ కేంద్రంలో పర్యావరణహిత జీవన శైలి కార్యక్రమంలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేసి, అవగాహన కల్పించారు. సచివాలయ ఆవరణంలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా అరకు ఎమ్మెల్యే పాల్గుణ, విశాఖ ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ సుభద్రలు మాట్లాడుతూ పచ్చదనాన్ని పరిరక్షించి పర్యావరణాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కాలుష్యం నుంచి విముక్తి పొందాలంటే పచ్చదనాన్ని పరిరక్షించుకోవాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని విడనాడాలన్నారు. ఎంపీపీ సీతమ్మ, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ డి.చంద్రశేఖర్, ఫారెస్ట్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



చెరపల్లిలో గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

జి.మాడుగుల: ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణాన్ని పరిరక్షించాలని అటవీశాఖ అధికారి శ్రీనివాస్, సిబ్బంది పిలుపునిచ్చారు. మండలంలో సుర్మతి పంచాయతీ కేంద్రంలో శుక్రవారం లోతు గెడ్డ అటవీశాఖ రేంజ్ ఆధ్వర్యంలో జీవనశైలి-పర్యావరణం కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే అనర్థాలను వివరించారు. దుకాణాల్లో ప్లాస్టిక్, పాలిథిన్ వస్తువులు విక్రయించొద్దన్నారు. అటవీశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యతగా చేపట్టాలని ఫారెస్టు బీట్ ఆఫీసర్ హిమబిందు అన్నారు. అటవీశాఖ అధికారులు శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి, అడవుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్, పాలిథిన్ నిషేదం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. డీఆర్ఓ కృష్ణారావు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

పులిదాడిలో నాలుగు పశువులు మృతి



పులి దాడిలో మృతి చెందిన పశువు

అనంతగిరి: మండలంలోని రొంపల్లి పంచాయతీ కోటపర్తివలస గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో పులి దాడిలో నాలుగు పశువులు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. కొటపర్తివలస గ్రామానికి చెందిన గుమ్మడప్పు సింహాద్రి అనే గిరిజనుడికి చెందిన నాలుగు పశువులు గ్రామ సమీపంలో అటవీ ప్రాంతంలో గురువారం అర్ధరాత్రి పులిదాడిలో మృతిచెందాయి. శుక్రవారం ఉదయం అటవీ ప్రాంతానికి వెళ్లిన గిరిజనులు మృతిచెందిన పశువులను గుర్తించి, గిరి రైతు సింహాద్రికి, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. కొద్దిరోజులుగా పులి సంచరిస్తున్నట్లుగా స్థానిక గిరిజనులు చెబుతున్నారు. అధికారులు స్పందించి, పులి నుంచి రక్షణ కల్పించాలని వారు కోరుతున్నారు.

ఎర్ర చందనం తోట దగ్ధం

బుచ్చెయ్యపేట : ఎల్.శింగవరంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సంభవించిన అగ్ని ప్రమాదంలో ఎకరన్నర పొలంలో ఎర్ర చందనం తోట దగ్ధమైంది. సుమారు రూ.3 లక్షలు ఆస్తి నష్టం సంభవించింది. భవానికి చెందిన పొలంలో శుక్రవారం వ్యవసాయ విద్యుత్ మోటారుకు వచ్చే వైర్లు నుంచి అగ్గినిప్పులు పడి ప్రమాదం సంభవించింది. గాలికి అగ్గి నిప్పులు రాజుకుని మంటలు వ్యాపించాయి. పలువురు వచ్చి మంటలను అదుపు చేశారు.

వర్షంతో ఉపశమనం

చల్లబడిన మన్యం



చింతపల్లిలో కురుస్తున్న వర్షం



పెదబయలులో కురుస్తున్న వర్షం



చింతపల్లిలో ఈదురుగాలులకు వైర్లపై పడిన చెట్టు

సాక్షి, పాడేరు: గత వారం రోజుల నుంచి అధిక ఎండలతో ఇబ్బందులు పడిన మన్యం వాసులకు శుక్రవారం చల్లటి వాతావరణంతో ఉపశమనం ఏర్పడింది. జిల్లా కేంద్రమైన పాడేరుతో పాటు సమీప గ్రామాలలో వర్షం కురిసింది. పాడేరు పట్టణంలోని ఐటీడీఏ ప్రాంగణం ,సినిమాహాల్ సెంటర్, పాతబస్టాండ్‌లో ఓ మోస్తరు వర్షం కురిసింది. సంత ప్రాంతం నుంచి వంతాడపల్లి, కందమామిడి, మినుములూరు, పాడేరు ఘాట్‌లో సుమారు గంట సమయం పాటు భారీ వర్షం కురిసింది.

జిల్లాలో శుక్రవారం కురిసిన వర్షానికి చింతపల్లిలో 3.7 సెంటీమీటర్లు, ముంచంగిపుట్టులో 1.4 సెంటీమీటర్లు, వై.రామవరంలో 1.30 సెంటీమీటర్లు, అడ్డతీగలలో 1.0 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

పెదబయలు: మండలంలోని ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది.శుక్రవారం సాయంత్రం ఒక్క సారిగా మేఘాలు ఏర్పడి వర్షం కురిసింది. ఈదురుగాలులకు పలు చోట్ల చెట్టు కొమ్మలు విద్యుత్ వైర్లపై పడటంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సిబ్బంది కొమ్మలను తొలగించి సరఫరాను పునరుద్ధరించారు.

అరకులోయ రూరల్: మండలంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు వరకు ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. జన జీవనం స్తంభించింది.

చింతపల్లి రూరల్: మండల కేంద్రంలో ఉరుములు, మెరుపులు.ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది.చెట్ల కొమ్మలు విద్యుత్ లైన్లపై పడటంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది.